“కథానిక”

# పరిచిత లావణ్యం

—డి. కె. ప్రసాద్

సాయంకాలం నాలుగు గంటలయింది. ఆధునిక వ్యక్తులకు యాత్రా స్థలమైన 'నిత్యానంద భవన్' ముందు హోటల్లో మూర్తీ, నేనూ కాఫీ రుచిచూస్తూ, రాజకీయాలను సింహావలోకనం చేస్తున్నాం. ప్రశ్నలు, జవాబులు ఇచ్చి పుచ్చుకుంటున్నాం. ప్రశ్న వెయ్యడంలో మూర్తి గొప్ప మొనగాడు. వాడు వేసే ప్రశ్న ఓ పట్టాన మెదడు జేరుకోదు. కాని, అదేమిటో ఆ పూట ఉత్తి చెరుకు పిప్పిలాంటి ప్రశ్నలు వేస్తున్నాడు. నేను ఆ విషయాన్నే మనస్సులో ఆలోచించుకుంటున్నాను. కాని మరొక వింత. ఆ ప్రశ్నలే అనాడు ఎందుచేతనో కొరుకుబడ్డం లేదు. దీర్ఘంగా ఆలోచిస్తేనేగాని, జవాబివ్వలేక పోతున్నాను. ఒక్కొక్క రోజున వేళా విశేషం అలాగే ఉంటుంది మరి.

ఉన్నట్టుండి ఒక్కసారిగా మూర్తి 'అయితే శర్మా, రేపు నాసిక్‌లో జరగబోయే కాంగ్రెస్‌ను గురించి నీ ఉద్దేశ్యం ఏమిట్రా?' అని ఒక పెద్ద ఉమ్మడి ప్రశ్న వేశాడు. అదే మామూలు రోజుల్లో అయితే, వాడు ఇక చాలురా బాబూ అనేవరకూ చెప్పేవాణ్ణి. కాని అదేమిటో, మెదడుకి ఏమీ తట్టలేదు. అయినా ప్రశ్నతో కుస్తీపడుతూనే ఉన్నాను మనస్సులో.

ఇంతలో నా వెనకాల గుప్పుమని సెంటు వాసన వేసింది. నా యీ నలభై యేళ్ళ జీవితంలోను ఎప్పుడో ఆ వాసన నా ముక్కుకు తగిలినట్లు గుర్తు. కాని ఏ సంవత్సరంలో ఏ నెలలో, ఏ పట్టణంలో వగైరా చరిత్రాత్మక ప్రశ్నలకు మెదడులోంచి జవాబు రాకుండా ఉంది. కాని బాగా పరిచయమున్న వాసనే మరి!

ఈమధ్య రాజకీయాలు అవసరం కొద్దీ బుర్రలో ప్రవేశించి, కొన్ని కొన్ని మధుర స్మృతులను బైటికి తరిమివేశాయి. తిరిగి వాటిని వెనక్కు రప్పించే తీరుబడి కాని, అవకాశం కాని లేకుండా పోతోంది. కారణం నెత్తిమీద ఖద్దరు టోపీ వుంది.

సదరు వాసనకు జన్మస్థలం ఒక ప్రౌఢ. బహుశా ఆమె జీవితంలో ముప్పైయైదు వసంతాలు, అందులో ఏ ఇరవయ్యో అతి మధురమైనవి గడిచివుంటాయి. అయినా, యింకా పది, పదిహేనువరకు తన మాధుర్యాన్ని నిలబెట్టుకోవడానికి అవకాశముంది. నాగరికతకు పేరుమోసిన ఆ హోటల్లోకి వచ్చే వ్యక్తుల ఆకారవైఖరులను వర్ణించడం అనవసరం. అందులో స్త్రీని.

ఆమె పరివారంకూడా ఎంతో మంది లేరు. ఉత్తరార్థంలో పడబోతూన్న ఒక పురుషుడు, యింకా మొదటి దశలోనే ఉన్న ఒక కుర్రాడు అంతే.

సపరివారంగా ఆమె మాకు అనతి దూరంలో ఒక గదిలో కూర్చుంది. బహుశా కుర్రవానికి ఆకలి ఎక్కువగా ఉందేమో అటూ యిటూ పరుగెడుతూన్న ప్లేట్లవైపు జాలిగా చూస్తున్నాడు. పెద్ద వ్యక్తి ఏదో ఆధ్యాత్మిక చింతలో మునిగి తేలుతూన్నట్టు ఆ అర్ధనిమీలిత నేత్రాలనుబట్టి ఊహించాను. ఇక, ఆమెమాత్రమే అటూయిటూ పరిమర్శనతో చూస్తోంది. నలువైపులా పరుగెడుతూన్న ఆమె చూపులు మూర్తిని, నన్ను చూడగానే ఆగిపోయాయి. మూర్తి ఆమెవైపు బాహాటంగా చూస్తున్నా నేనుమాత్రం దొంగ చూపులు చూస్తున్నాను. పరస్త్రీని గురించి మనస్సులో ఏమనుకున్నా, పైకి ముఖాముఖాగా చూడ్డం ప్రస్తుత నాగరికతకు వ్యతిరేకం గదా మరి!

'ఆమెను బాగా చూశావుట్రా, శర్మా!' అన్నాడు మెల్లిగా మూర్తి. యింకా వాడి దృష్టి అటే ఉంది.

'ఆ' అన్నాను నేను సూక్ష్మంగా.

'ఆవిడది ఏవూరో తెలుసునా?' మూర్తి ధోరణి యింకా మారలేదు.

'ఎక్కడో చూసినట్టు గుర్తు' నిజం కూడా అంతే.

ఆమె కనురెప్ప వెయ్యకుండా ఇటే చూస్తుండటంవల్ల మా దృక్కులను బలవంతాన మళ్ళించవలసి వచ్చింది.

ఇంతవరకూ మూర్తి ఆమె ఎవరో చెప్పలేదు. నేనే అడుగుదామని నోరు తెరుస్తుంటే.

'నమస్తే! మూర్తిగారు!' అంది ఆమె మందహాసంతో.

మూర్తికి భూలోకాన్నుండి సువర్లోకానికి ఒక్కసారి ఎగిరినట్లయింది కాబోలు, అర మోడ్పు కళ్ళతో, వందనాన్ని ప్రతివందనంతో స్వీకరించాడు. ఆ భంగిమలో కొంత అహంభావంకూడా కనిపిస్తోంది.

'అలా దూరంగా కూర్చున్నారేం! ఇలా రండి' అని అక్కడే ఖాళీగా ఉన్న రెండు ఆసనాల్ని చూపించింది. అసలే స్త్రీ, అందులో అధునిక, అటుపైన పరిచిత. ఆమె కోర్కెను తృణీకరించే మొండితనం మూర్తిలో లేకపోవటంవల్ల, తన మకాం వెంటనే మార్చేశాడు. నేను వాణ్ణి అనుసరించకుండా వాడికి ఆమెకు ఏం పరిచయమా అని ఆలోచిస్తున్నాను. అందులో ఆమె ఆజ్ఞను పాలిస్తున్నాను కూడాను. సామాన్యంగా మూర్తి అభిప్రాయం-నలుగురిలో తిరిగే స్త్రీ నైతిక ప్రవర్తన మేలిమి బంగారం గీటుకు రాదుకదా, కాను గీటుకుకూడా రాదని. నేను మాత్రం పిడికెడు బియ్యానికి ఒకటే మంత్రం వద్దంటాను. అక్కడే మేం వ్యతిరేకిస్తుంటాం. మిగతా విషయాల్లో మా యిద్దరిదీ ఏకవృత్తమే. గమ్యస్థానం చేరుకున్న మూర్తి నన్నుకూడా ఆహ్వానించాడు. కాని, ఆ ఆహ్వానంలో వాడికి వచ్చిన దానిలో ఉన్న మాధుర్యం లేదు. కారణం నన్నాహ్వానించిన మూర్తి మొగాడు. అంతే.

సకాలంలో ఫలహారాలువచ్చాయి. వాటితో బల్ల నిండిపోయింది. ఆకలితో నకనక లాడుతూన్న కుర్రాడు వెంటనే తినడానికి ఎగబడ్డాడు. ఉత్తరార్థంలో పడబోతూన్న రెండో వ్యక్తి కూడా ఆ కుర్రాణ్ణి అనుసరించాడు. ఆమె మాత్రం మా అనుజ్ఞకోసం ఎదురుచూస్తోంది. అందరికీ ఉన్నది మిత్రుడైన మూర్తి లాంఛనప్రాయంగా మైసూరుపాకం ముక్క కొంచెం విరిచి నోట్లో వేసుకుంటూ, మాకుకూడా ఉపక్రమించడానికి అనుజ్ఞ ప్రసాదించాడు, తనోక సభాధ్యక్షుడిలాగ. వాడికి ఎప్పుడూ అదొకజబ్బు. లేని ఆధిక్యతను ఆపాదించుకుంటాడు.

ఆమె, మూర్తి ఫలహారం విషయంలో నాకన్న కొంచం ముందుగానే ఉన్నారు. నేను మాత్రం మందంగా సాగుతూ, గడిచిపోయిన ఏదో అవ్యక్త ఘట్టాన్ని నెమరు వేయడానికి ప్రయత్నిస్తున్నాను మూర్తి నా దీక్షకు భంగం కలిగిస్తూ-

'ఈమె శ్రీమతి...' మనస్సులో తలగోక్కున్నాడు, తర్వాతమాట అందక.

'మిసెస్ లావణ్య రామారావు' అంది నవ్వుతూ, మూర్తి చిరునవ్వుతో కృతజ్ఞతను తెలియజేస్తూ,

'వారు మిస్టర్...' మళ్ళీ అదే అవస్థలో పడ్డాడు.

'రామారావు' అంది ఆమె.

అలాగే మూర్తి మళ్ళీ 'ఆ అబ్బాయి మాస్టర్...' అసంపూర్తిగా అంటే, 'రామారావు' అని పూర్తిచేసి, పకాలున నవ్వింది. మూర్తి కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. అంత కులగోత్రాలు తెలియకుండా మావాడు ఆ కుటుంబాన్ని ఎలా పరిచయం చేద్దామనుకున్నాడో నా కర్థంకాలేదు. మొత్తంమీద ఆయన ఆమె భర్త, ఆ కుర్రవాడు ఆమె సుపుత్రుడు.

ఆమె పేరుతో నాలో ఇంతవరకూ మెదులుతూన్న అనుమానం కొంచం కదిలింది. నేను కాస్త తిండి ధోరణిలోపడ్డాను. ఇంతలో మా వాడి చెయ్యి నావైపు తిరిగింది. నేను తలెత్తి పైకి చూశాను.

'వీడు క్షమించాలి, వీరు మిస్టర్...' వాక్యం పూర్తి చెయ్యబోతున్నాడు మూర్తి. వెధవ గులాబ్‌జాం ముక్క గొంతుకు అడ్డంపడింది. దాన్ని లోపలికి తోసేలోగా లావణ్య,

'శర్మ' అని పూర్తిచేసింది. వెంటనే మళ్ళీ నవ్వింది. నిజం చెప్పొద్దూ, ఆ నవ్వు నాకు మత్తెక్కించేటట్టుంది. ఆ సమయంలో నేను

అథఃపాతాళానికి పోతున్నానో, అంతరిక్షం లోకి యెగిరిపోతున్నానో తెలియడంలేదు.

అయితే ఆమె నన్నెరుగునన్న మాట! ఐతే, నేను ఆమెను ఎరిగే ఉండాలి. కాని సరిగా జ్ఞప్తికి రావడంలేదు. బహుశా ఎవరిద్వారానైనా తెలుసునేమో! ఏమో నాకదేమీ అవగాహన కావడంలేదు. అయినా యిప్పుడా గొడవ అంతా ఎందుకు? అసలు విషయం-ఆమె నన్నెరుగును. అది చాలు.

నాకన్న ద్విగుణీకృత వేగంతో మిస్టర్ మాస్టర్ రామారావులు ప్లేట్లు కాళీ చేసేస్తున్నారు. మా మందగొడితనానికి సర్వరుకూడా నొచ్చుకున్నట్లు వాడిముఖమే చెబుతోంది.

కొంతసేపు నిశ్శబ్దం. లావణ్యే తిరిగి సంభాషణ ప్రారంభించింది.

'శర్మగారూ, మీకు జ్ఞాపకముందో లేదో కాని, ఆగస్టు విప్లవం రోజుల్లో మీ రొకసారి మా యింటికి వచ్చారు' అంది నావైపు చూస్తూ.

మామూర్తి నోరు సగం తెరచి, కళ్లు పెద్దవి చేసి, ఆశ్చర్యార్థకంగా మా యిద్దరి వైపు చూశాడు. నేను మాత్రం మళ్లీ జిజ్ఞాసలో పడ్డాను.

నిజంగా నేను ఆ రోజుల్లో ఒక అజ్ఞాత వీరుణ్ణి. కర్తవ్యనిర్వహణకోసం, ఇనపకటకటాల నుండి, తప్పించుకొనే ప్రయత్నంలో అనేక గ్రామాలు తిరిగేను. అంటే పిరికి తనంతో కాదు. ఆ సందర్భంలో అనేకమంది యిళ్లకు వెళ్లేను. అనేక వ్యక్తులను చూశాను. వారిలో ఆడా, మొగా, లేతా, ముదరా, మంచీచెడ్డా అన్నిరకాలు ఉన్నారు. కాని, ఈమె ఫలానా అని జ్ఞాపకముండేటట్లుగా ఆమెను చూసినట్లు గుర్తులేదు. అందుచేత కాబోలు నసుకున్నాను. అయినా, లావణ్య నన్నెరుగు నంటోంది. సంస్కారం కల యువతి మాట ఎలా కొట్టెయ్యను?

'అవునండి. జ్ఞాపకముంది' అన్నాను బెదురుతూ. వివరాలు అడిగితే మాత్రం చచ్చానన్న మాటే.

'ఏరా శర్మా, నువ్వు లావణ్యను యిదివరకే ఎరుగుదువన్నమాట! అమ్మ పిడుగా!' ఆదొక మహాదృష్టయోగం లాగ నన్నభినందించాడు మూర్తి.

ఇంతకూ మిస్టరు రామారావుకి ఏం తోచిందో మావైపు విమర్శగా చూశాడు. వెంటనే లావణ్య తప్పొప్పుల పట్టికల పుస్తకంలా ముఖం పెట్టి-

'క్షమించండి. వీరిద్దరు నా ఆప్తమిత్రులు. ఈయన శర్మగారు, ఆయన మూర్తిగారు. అంది భర్తతో. కాని, మా యితర వ్యాపకాలను గురించిఏమీ చెప్పలేదు. బహుశా ఆమె ఎరగదేమో! ఇకనేం మేమిద్దరం ఆమె ఆప్తమిత్రుల జాబితాలో పడ్డామన్నమాటే. అయితే మూర్తి ఆ అదృష్టాన్ని సంపాదించుకున్నాడు. నాకు దొరికింది. అంతే తేడా

లావణ్య మళ్లీ మా వైపు తిరిగింది. 'ఏమండీ, యిప్పుడైనా జ్ఞాపకం వచ్చిందా?' నన్ను గురించే ఆ ప్రశ్న. లేదని చెప్పడానికి వెధవ సభ్యత అడ్డు వచ్చింది.

'అవును, అప్పుడు మీరు...' ఒక గుటక వేశాను.

'తెనాలిలో ఉండే దాన్ని'

ఆమె రూపం యొక్క ఆనవాళ్లు నా మెదడులో యేమూలో యింకా మిగిలి ఉన్నాయి. వాటిని పోల్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నాను. బహుశా రెండు దశల క్రిందవి అయివుండాలి!

'అప్పటికి యిప్పటికి ఎంతో మార్పువచ్చింది మీ ఆకారంలో' అంది లావణ్య. అవును మరి. ఆగస్టు విప్లవంతో నేకాదూ దొరటోపీ స్థానాన్ని ఖద్దరు టోపీ, ట్వీడ్ సూట్ల స్థానాన్ని ముతక ఖద్దరు ఆక్రమించాయి! ఇక మనస్సు? దాన్ని గురించి ఆమె కలపెట్టనప్పుడు నాకు మాత్రమెందుకు ఆ గొడవ?

'ఆ రోజుల్లో ఎంతహాయిగా వుండేవాళ్ళం!' ఆమె తిరిగి అంది. తెరచిననోరు మూసేస్థితిలో లేదు లావణ్య. యింకా, వెన్నెల రాత్రుళ్ళు, డాబా మీద కొబ్బరిచెట్ల నీడలు, దూరాన నక్కల అరుపులు, ప్రక్క గదిలో గాజుల చప్పుడు వగైరా వగైరా ఏకరువు పెడుతుందేమో!

మూర్తి అప్పుడే దొంగను చూసిన పోలీసు లాగ ముఖం పెట్టి చూస్తున్నాడు మమ్మల్ని. ఇంతకూ ఎవరు హాయిగా వుండేవారో ఆమె చెప్పలేదు. ఆ రోజుల్లో నాకెక్కడ హాయి ఉండేడిసి చచ్చింది? తిన్నచోట నిద్రలేదు, నిద్రపోయిన చోట తిండిలేదు. బహుశా ఆమె

కంటికి అలాగ కనిపించానేమో! ఎంతైనా ధైర్యవంతుణ్ణి కాదూ మరి! నేనుమాత్రం అప్రయత్నంగా దొరికిన ఆ ప్రత్యేకతను ఎందుకు పోగొట్టుకోవాలి?

'నిజమే. ఆ రోజులు తిరిగిరావు' అన్నాను కొంచెం జాలి అభినయిస్తూ.

'అప్పటికి సుశీ యింకా చిన్న పిల్ల. మహా పెద్దపెంకిగా ఉండేది' ఆమె వాక్యాన్ని బట్టి, ఆ సుశీ యీ పాటికి పెద్దపడుచేకాక, పెద్ద మనిషి కూడా అయివుంటుందని నిర్ధారించాను.

'ఏమటో కాలము అలాంటి మార్పు తెస్తుంది' అన్నాను. మూర్తి మాత్రం ఆ సుశీ యెవరో, ఎలా ఉంటుందో అని మీన మేషాలు లెక్కపెడుతున్నట్లు వాడిముఖమే చెబుతోంది. పాపం వాడి స్థితి చాలా విషాదంగా ఉంది. వాడు ఆమెను నాకు పరిచయం చేద్దామనుకొనేసరికి లావణ్య నన్ను తన ఆత్మీయుణ్ణిగా భావించి, వాణ్ణే దూరం చేసింది. దానితో వాడు మానసికంగా కుంగిపోయి, మాట్లాడ్డంలేదు. యిక, నాకేం రాసి వుందో!

ఇప్పటికి ఫలహారాలు వగైరా పూర్తి అయినాయి.

'కాని మరో పెద్దప్రమాదం జరిగిపోయింది శర్మగారూ!' ఆమెముఖంలో విషాదచ్ఛాయలు కనిపించేసరికి నా కళ్ళవెంబడి నీళ్ళు వస్తాయా అన్నట్లు దీనముఖంపెట్టి.

'ఏమిటది?' అన్నాను. (ఆమెను ఏమండీ అనాలో, ఏమమ్మా అనాలో అర్థంకాక. ఉమ్మడిప్రయోగం ప్రారంభించాను) నటించలేక పోతే, యీ ప్రపంచంలో నెగ్గలేము. మూర్తి మాత్రం గంభీరంగా కూర్చున్నాడు.

బహుశా ఈ హోటల్ పదార్థాలు రుచించలేదో ఏమో, మిస్టర్ మాస్టర్ రామారావులు 'ఇప్పుడే వస్తా'నని చెప్పి, బయటికి వెళ్ళేరు. నిజంగా రామారావుగారికి భార్య అంటే ఎంత నమ్మకమో! నాకాశ్చర్యం వేసింది. ఇద్దరు పరపురుషుల మధ్య లావణ్యను విడిచిపెట్టి వెళ్ళారు. అంతే, ఆయన హృదయం ఎంత విశాలంగా ఉందో! కొలిచి చూద్దామంటే వీల్లేని విషయమైపోయింది మరి!

మూర్తికి సుశీని గురించి ఆదురా ఎక్కువై పోయింది. 'ఏమిటో ఆ ప్రమాదం?' విషయాన్ని మళ్ళా మొదటికి లాక్కొచ్చాడు మూర్తి. బహుశా ఎవరితోనైనా లేచిపోయిందనుకున్నాడు కాబోలు! నిజంచెప్పొద్దూ, నాకూ ఆ అనుమానమే కలిగింది.

ఈ అర్థసంవత్సరానికి లైసెన్సు కట్టడానికి బద్ధకించేసరికి, కార్పొరేషన్ కింకరులు లాక్కుపోయారు' అంది జేబురుమాలుతో కళ్ళు అద్దుకుంటూ.

నేనూ, మూర్తి తెల్లముఖాలు వేశాం. నేను మాత్రం వెంటనే రంగు పిరాయించి,

'చూశారా, మనం శాస్త్రశ్రద్ధ చేయడం వల్ల ఒకజీవికి ప్రమాదం కలిగింది. అదే మానవుడైతే?' నా అతితెలివికి నేనే సంతోషించాను. వెంటనే లావణ్య—

'మానవుడికి కూడా లైసెన్సు కట్టాలనే ప్రభుత్వం యింకా రాలేదండీ శర్మగారూ!' అని నా అతితెలివిమీద ఒక సమ్మెటపెట్టు


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

మెహతావారి
విశేష ఔషధములు

1 సుందరి ఎలిగ్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.

2 ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.

3 మస్తానాపిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు, జ్వరము లన్నిటికీ అమోఘముగా పని చేయును.

4 ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధి పరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టు లందరివద్ద దొరకును.

తయారు చేయువారు:

**K. S. MEHTA & CO.,**
**250, China Bazar, Madras.**

పెట్టింది. నేను ఆనాడు లేవగానే ఎవరి ముఖం చూశానోగాని, అన్నీ అవమానాలే సంప్రాప్తిస్తున్నాయి. ఎలాగైనా గట్టెక్కుదామని దృఢ సంకల్పంతో ఉన్నాను అప్పటికీ నేను.

'అవును కాని, మీకు నా తాత తెలుసును కాదూ, చండశాసనుడు. ఓరోజున మాతో...' అని విషయం మార్చబోతూంది లావణ్య.

మధ్యలో నేను అడ్డుకుని, 'ఎవరూ, ఆ ముసలాయనా? అమ్మో, దేవాంతకుడు' అన్నాను. అవును, చండశాసనుడు దేవాంతకుడు ఒకటేగా మరి.

'అన్నట్లు కామేశ్వరి యిక గత్యంతరం లేక విశ్వాన్నే పెళ్ళిచేసుకుందండోయి ఆఖరికి!' ఆమె విషయాల్ని వేగంగా మారుస్తూంటే, నేను ఆమె ప్రశ్నల్నే తిప్పి, జవాబిస్తున్నాను. అంతకన్న నాకేమైనా తెలిస్తేగా!

'అలాగా, మరోమార్గం లేనప్పుడు ఏం చేస్తుంది పాపం!' మనస్సులో కంగారు పడుతున్నాను, ఈ పాత్రలంతా ఎవరా అని. నా అదృష్టం బాగుండడంవల్ల లావణ్య ఆ వ్యక్తులను గురించి అంతగా పట్టించుకోవడం లేదు కాబట్టి, అంతటితో సరిపోయింది. మూర్తి యింకా యేయే విషయాలు వస్తాయో అని చెవులు రిక్కించి వింటున్నాడు

'ఇంతలో మిస్టర్, మాస్టర్ రామారావులు ఆ దృశ్యంలో ప్రవేశించారు. లావణ్య ఏమనుకుందో ఏమో, విషయం హటాత్తుగా మార్చేసింది.

'ఇంతకూ నన్ను గుర్తుపట్టేరా శర్మగారూ!' అని అడిగింది నన్ను. మూర్తి యిది కలా, నిజమా అని జిజ్ఞాసలో పడ్డాడు. నాకు పచ్చివెలక్కాయ గొంతున పడినట్టయింది. గ్రంథం మళ్ళీ మొదటికొచ్చింది. నేను నీళ్ళు నములుతున్నాను.

'నా అసలు పేరు సత్య. ఇరవై సంవత్సరాల క్రితం కొల్లూరులో......' అని ముఖంలోకి చూసింది. ఆమాటల్లో అనేక భావాలు వ్యక్తమవుతున్నాయి.

నా మెదడుకి మంచుతెర ఒక్కసారిగా విడిపోయింది. కాని మూర్తికి మాత్రం ఆ మంచుతెరే మరింత దట్టమయింది.

అయితే, మీకు రెండు పేర్లున్నాయన్న మాట. ఆ చీకట్లో దారితెలియక కొట్టుమిట్టాడుతూన్న వానిలాగ అడిగేడు మూర్తి పాపం.'

'అవునండి. మీరు నన్ను లావణ్యగా ఎరుగుదురు. శర్మగారు సత్యగా ఎరుగుదురు. నేను మీ యిద్దరినీ ఎరుగుదును.'

అప్రయత్నంగా నేను వాచీ కేసి చూసి ఏదో మహా పనున్నవాడిలాగ, 'క్షమించాలి అర్జంటు పనుంది. మళ్ళా కలుసుకుందాం' అని లేచి మూర్తి చెయ్యిపట్టుకుని మళ్ళా వెనక్కి తిరిగి చూడకుండా బైటికి నడిచాను. మూర్తి అమాయకంగా నన్ను అనుసరించాడు.

మేం వెడుతూంటే లావణ్యగారు, సత్య పకాలున నవ్విన నవ్వు నా చెవిలో యింకా ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఇంతకూ నా యోగం బాగుండబట్టి అంతటితో బైట పడగలిగేను. లేకపోతే ఆరోజు నాపని ఏమయ్యేదో!

అసలు రహస్యం సత్యకు, నాకు తెలుసును, ఆమె చెప్పిన పాత్రలు, స్థలాలు, కాలం అన్నీ కల్పన. అసలు ఆమె ఎవరో ఆఖరికి గాని గుర్తుకు రాలేదు నన్ను పట్టి మూర్ఖుణ్ణి చేసి విడిచిపెట్టింది. పాపం సహవాస దోషం వల్ల మూర్తికూడా నాతో కలవవలసి వచ్చింది. కాని నాకు తెలుసును, వాడికి తెలియదు. అంతే భేదం!

దారిలో మూర్తి నన్ను ప్రశ్నించాడు. నన్ను లావణ్య ఎలా ఎరుగునని.

అబ్బాయి! జీవితంలో అనేక వ్యక్తులు ఎదురౌతూంటారు. అందులో లావణ్య ఒకతె. దానికి ఆశ్చర్యపడ్డమెందుకు?' ఇత్యాదిగా వేదాంత ధోరణిలో చిన్న ఉపన్యాసమిచ్చాను. అయినా వాడు సంతుష్టి పడలేదని వాడి ముఖలక్షణాలవల్ల గ్రహించాను.

ఏమయినా, ఇరవై సంవత్సరాల క్రితం, సత్యతో ఏర్పడిన మైత్రి, ఆమె చనువును నేను అపార్థంచేసుకుని, ఒక మధుర వసంతాన్ని నా వద్ద గడుపమని ప్రార్థించడం, తత్ఫలితంగా నా చెంప వాచడం మరుపురాని ఘట్టాలు. అది మీ దృష్టికి ఏమో కాని, నాకుమాత్రం ఒక మధురానుభూతి!